'ఆశ'ల నిరసన

- కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్
- ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేత
- పాలమూరు కలెక్టరేట్, ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల ముట్టడి
- సీఐటీయూ నాయకుల సంఘీభావం

మహబూబ్‌నగర్, జూలై 18: కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలలో భాగంగా ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లతో కలిసి ధర్నా చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణకు, అనంతరం క్యాంప్ ఆఫీస్‌కు చేరుకొని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

నారాయణపేట మున్సిపల్ పార్క్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తాం

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆశవర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే తమ సమస్యలు పరిష్కరించాలని మోటార్‌లైన్ సంఘం ఆధ్వర్యంలోనూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సాధన, యాదమ్మ, సౌజన్య, పద్మ, సునీత, సీఐటీయూ నాయకులు కురుమూర్తి, గౌస్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో వర్షానికి కూలిన ఇండ్లను ఎమ్మెల్యే పరిశీలించారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి

జడ్చర్ల, జూలై 18: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు గురువారం జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే లేకపోవడంతో పీఏ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, సహాయ కార్యదర్శి సత్యయ్య మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, నేడు ఎమ్మెల్యేతో పాటు అధికారులు కూడా స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో సరో, నజీమా, షబానా, సుగుణ, జయలక్ష్మి, శారద, మంజుల, విజయ, భాగ్యలక్ష్మి ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆశ వరకర్లు వినతి

మూసాపేట, జూలై 18: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కోరారు. ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మూసాపేట, అడ్డాకుల మండలాల వర్కర్లు మూసాపేటలో ఎమ్మెల్యే జీఎమ్మార్‌ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

నారాయణపేటలో..

నారాయణపేట, జూలై 18: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కార్యాలయంలో ఆశ వర్కర్లు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మిస్కిన్ బాలమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం మాట్లాడారు. కార్యక్రమంలో నారాయణపేట, కోటకొండ, మరికల్, ధన్వాడ, దామరగిద్ద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హీర్యానాయక్ కుటుంబానికి పరామర్శ

హీర్యానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, జూలై 18: మండలంలోని పెద్దాదిరాల రామస్వామిగుట్టతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఏఎంసీ డైరెక్టర్ హీర్యానాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గురువారం రామస్వామి గుట్టతండాకు వెళ్లి హీర్యానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. హీర్యానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పీఏసీసీఎస్ చైర్మన్ సుదర్శనగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, యాదయ్య, ప్రణీల్, శంకర్‌నాయక్, శ్రీకాంత్, ఇంతియాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ఉపాధికి ఊతం అప్రెంటీస్ మేళా

- పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, జూలై 18: విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్ణయించుకోవాలని, ఉపాధి మార్గాలకు అప్రెంటీస్ మేళాలు దోహద పడతాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అప్రెంటీస్ మేళా 2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభకు సరితూగే ఉద్యోగాలు ప్రైవేట్ రంగాల్లో ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని విజయాలు సాధించాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా.శ్రీధర్‌సుమన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో స్కిల్ అధారిత కోర్సులకు డిమాండ్ పెరుగుతోందన్నారు. అప్రెంటీస్ మేళాలో దాదాపు వెయ్యి మంది పాల్గొనగా, 704మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే చేతులమీదుగా ఎంపిక పత్రాలను అందజేశారు.

పీయూలో ఉత్సాహంగా వార్షిక వేడుకలు

పాలమూరు, జూలై18: మహబూబ్‌నగర్ పాలమూరు విశ్వవిద్యాలయంలో గురువారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు క్రీడా విభాగంలో క్యారమ్స్, చెస్, బ్మాడింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి నాగసుధ, సీనియర్ అధ్యాపకులు అర్జున్‌కుమార్, పీడీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ పునఃప్రారంభం

పాలమూరు విశ్వవిద్యాలయంలోని బాలికల వసతిగృహాన్ని గురువారం పునఃప్రారంభించారు. ఏబీవీపీ పీయూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీయూ సెక్రటరీ శివకుమార్, ఉపాధ్యక్షుడు జైపాల్, జాయింట్ సెక్రటరీలు బాలశివసాయి, నగేశ్, బాలికల కన్వీనర్ నందిని, ఖేల్ కన్వీనర్ శ్రీను, సోషల్ మీడియా కన్వీనర్ నరేశ్, అకాడమిక్ బ్లాక్ ప్రెసిడెంట్ వేణు, వేణుగోపాల్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి

డ్రైనేజీని పరిశీలిస్తున్న చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్, జూలై 18: మున్సిపాలిటీలోని అన్నివార్డుల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ కోరారు. గురువారం ఆయన 10వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని డ్రైనేజీని, తాగునీటి సరఫరా, సీసీరోడ్ల ఆవశ్యకతను పరిశీలించారు. అదేవిధంగా ఉర్దూ మీడియం పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 8తరగతులకు గానూ కేవలం 42మంది విద్యార్థులే ఉండడం కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులను పెంచాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల కొత్తగా డ్రైనేజీలు, సీసీరోడ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సైదమ్మ, ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

లక్ష్మణ్‌గౌడ్(ఫైల్)

మూసాపేట(అడ్డాకుల), జూలై 18: గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. అడ్డాకుల మండలం రాచాలకు చెందిన లక్ష్మణ్‌గౌడ్(58) భార్య లక్ష్మికి వికలత్వం ఉన్నది. గతంలో ప్రభుత్వం నుంచి రూ.4వేలు ఫించన్ వచ్చేది. పింఛన్ డబ్బుతోనే బతికేవారు. ఆర్నెళ్ల కిందట సదరం క్యాంప్‌లో లోపం తక్కువగా ఉన్నట్లు సర్టిఫికేట్ రావడంతో పింఛన్ నిలిచిపోయింది. అప్పటి నుంచి బకుతు భారమై భార్యాభర్తలు తరుచూ తగాదా పడేవారు. భార్యను కొట్టడంతో బంధువుల ఇంటికి వెళ్లింది. భార్య లేకపోవడంతో ఈనెల 16న ఇంట్లో ఉన్న గడ్డిమందును తాగాడు. చుట్టుపక్కల వారు గుర్తించి జిల్లా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రుణమాఫీ డబ్బులు వెంటనే చెల్లించాలి

- పాలమూరు కలెక్టర్ విజయేందిర బోయి
- పాల్గొన్న పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

అధికారులతో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, నారాయణపేట కలెక్టర్ షిక్తా పట్నాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 18: ప్రభుత్వం చేసిన రుణమాఫీ డబ్బులను బ్యాంకు అధికారులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంక్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. రైతు రుణమాఫీ తొలి విడుతగా జిల్లాలో 39,380 మంది రైతుల ఖాతాలో రూ.211 కోట్లు జమ అవుతాయని చెప్పారు. అలాగే బ్యాంకు అధికారులు రైతులకు పెట్టబడి సాయంగా కొత్త రుణాలు ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకానికి రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, మహబూబ్‌నగర్, నారాయణపేట అదనపు కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్, డీఆర్‌డీవో బోజప్ప, బ్యాంక్ అధికారులు నర్మద, రవికిశోర్‌రెడ్డి, మురళీ కృష్ణ, ప్రసాద్ పాత్రో, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

మిడ్జిల్, జూలై 18: రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతువేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు దశల్లో రైతులకు రూ.2 లక్షల రుణం మాఫీ అవుతుందన్నారు. టెక్నికల్ సమస్య వల్ల రుణమాఫీ జరుగకపోతే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బు రైతులకు చేరాలి

నారాయణపేట టౌన్, జూలై 18: ప్రభుత్వం అందించిన రుణమాఫీ డబ్బులు రైతులకు తప్పకుండా వందశాతం చేరాలని, బ్యాంకర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, ట్రెయినీ కలెక్టర్ గరిమా నరుల్లా పాల్గొనగా రైతు రుణమాఫీ మార్గదర్శకాల అమలుపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. మొదటి విడతలో నారాయణపేట జిల్లాలో 28,684మంది రైతులకు రూ.165.45 కోట్లు రుణమాఫీ చేసిందని తెలిపారు. లబ్ధిదారుల వివరాలను బ్యానర్లను వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రైతువేదికలో ప్రదర్శించాలని ఆదేశించారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు రుణాలు తీసుకున్న రైతులకు ఆగస్టు నెలాఖరి వరకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం విజయ్‌కుమార్, డీఈవో జాన్‌సుధాకర్, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణగ్రామీణ బ్యాంకు, కోఆపరేటివ్ బ్యాంకు, ఇతర బ్యాంకర్లు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మరికల్, జూలై 18: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కన్మనూర్ ఉన్నత పాఠశాలలో మరికల్ ఎస్సై మురళి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కచ్చితంగా ఒక మొక్క నాటి, సంరక్షించాలని సూచించారు. పాఠశాల ఆవరణ పచ్చదనంతో ఉండేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలనారాయణ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పవన్, సుహాసిని, సుమత, రవికుమార్, పాఠశాల చైర్మన్ నర్సిములు, సీఆర్‌పీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, మతీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

నవాబ్‌పేట, జూలై18: మండలంలోని వీర్‌శెట్టిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆశ్రయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 22 మందికి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ గోపీనాథ్ పంపిణీ చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బాలానగర్, జూలై 18: జాతీయ రహదారిపై పెద్దాయపల్లి స్టేజీ సమీపంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కాకరజాల్‌లో నివాసం ఉండే అమ్మాపూర్‌కు చెందిన జంగయ్య (58) గురువారం పెద్దాయపల్లి స్టేజీ సమీపంలో మృతిచెందిన సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రాథమిక విచారణ అనంతరం మృతదేహాన్ని జడ్చర్ల దవాఖానకు తరలించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

జడ్చర్ల, జూలై 18: జడ్చర్ల మున్సిపాలిటీ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మంగళి రాములు హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుతదాడిలో దూడ

భూత్పూర్, జూలై 18: మండలంలోని వెల్కిచర్లలో జిల్లెల తిరుపతిరెడ్డి పొలంలో చిరుత దాడిచేసి దూడను చంపింది. గురువారం గ్రామస్తులు అనుమానంతో ఫారెస్ట్ అధికారులకు విషయం చెప్పగా.. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బర్రె దూడ చనిపోయిన పరిసరాల్లో అడుగు జాడలను పరిశీలించి చిరుత సంచరిస్తున్నట్లు నిర్ధారణ చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నిరంజన్, బీట్ ఆఫీసర్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడలు..

బాలానగర్, జూలై 18: బాలానగర్ మండలంలో వీధి కుక్కల బెడద పెరిగింది. బుధవారం అప్పాజిపల్లిలో శ్రీహరికి చెందిన రెండు లేగ దూడలపై వీధికుక్కలు దాడిచేసి చంపేశాయి. బాలానగర్, గుండేడు, నేరళ్లపల్లి, గౌతాపూర్, మోతీగణపూర్ గ్రామాల్లోనూ నిత్యం ప్రజలను గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి వీధికుక్కల సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జోరుగా ఇసుక రవాణా

మక్తల్, జూలై 18: అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో కృష్ణానది నుంచి విచ్చలవిడిగా ఇసుక తరలిస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ ఆరోపించారు. గురువారం మక్తల్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కృష్ణ మండలంలోని గుడేబల్లూర్, ముడుమాల్, టై రోడ్డు మీదుగా కృష్ణానది నుంచి రోజుకు వందలాది టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకొని, వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ కర్నె స్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బలరాం రెడ్డి, పార్టీ మాగనూరు మండల మాజీ అధ్యక్షుడు జయనాథ్ రెడ్డి ఉన్నారు.

కరివెనలో టీబీ వైద్య శిబిరం

భూత్పూర్, జూలై 18: మండలంలోని కరివెనలో టీబీ వ్యాధి అనుమానితులుగా ఉన్న 177మందిని పరీక్షించినట్లు డాక్టర్ అబ్దుల్‌రబ్ తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందితో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పూటం, ఎక్స్‌రే ద్వారా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్‌కుమార్, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, సిబ్బంది బాలరాజు, రాజుగౌడ్, ఏఎన్ఎం దేవ్లీ, హెల్త్ అసిస్టెంట్లు ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

పాలమూరు, జూలై18: మహబూబ్‌నగర్ ఆర్టీసీ ప్రయాణికుల కోసం శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలను సెల్ నెంబర్ 99592 26295కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

గణేశ్ పండుగ తొమ్మిది రోజులు

జడ్చర్ల, జూలై 18: ఈ ఏడాది నుంచి వినాయక చవితి ఉత్సవాలను తొమ్మిది రోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు వీహెచ్‌పీ ప్రతినిధులు తెలిపారు. గురువారం వారు జడ్చర్లలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని గణపతి మండపాల నిర్వాహకులు గమనించాలని కోరారు. సమావేశంలో జగ్‌పాల్ రెడ్డి, నరేందర్‌గౌడ్, శ్యాం, కృష్ణమూర్తి, అఖిల్ ఉన్నారు.

ఎంఈవో పాఠశాల తనిఖీ

మిడ్జిల్, జూలై 18: విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని ఎంఈవో మంజులాదేవి అన్నారు. గురువారం మండలంలోని కొత్తూర్, మల్లాపూర్ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హోంవర్క్, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. కాంప్లెక్స్ హెచ్ఎం సరస్వతి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బీసీ కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలి

పాలమూరు, జూలై18: మహబూబ్‌నగర్‌లో బీసీ కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కోరారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహబూబ్‌నగర్‌లో చదువుకునేందుకు వస్తారని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి పాత డీఈవో కార్యాలయాన్ని హాస్టల్స్‌కి ఇవ్వాలని తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, అధ్యక్షుడు భరత్, నాయకులు మణికంఠ, సాయి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

దేవరకద్ర, జూలై 18: మండలంలోని గోపన్‌పల్లిలో గురువారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలవారుజామున పీర్లను గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం పీర్లకు డట్టీలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ సందర్భంగా యువకులు వివిధ రకాల వేషధారణలతో హంగామా చేశారు. మొహర్రం పండుగను పురస్కరించుకొని గ్రామంలో తినుబండారాల దుకాణాలు ఏర్పాటు చేశారు. అనంతరం రాత్రి పీర్లను గ్రామ శివారుల్లోని చెరువులో నిమజ్జనం చేశారు.

రుణమాఫీ సంబురాలు

మాగనూరు/ కృష్ణ, జూలై 18: ఎన్ని ఆటంకాలు వచ్చినా రైతుల రుణమాఫీ ఆగదని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మాగనూరు మండలం రైతు వేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాగనూరు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏవో సుదర్శన్ గౌడ్, ఏడీఏ నాగేశ్‌కుమార్, ఏఈవోలు, నాయకులు పాల్గొన్నారు.

సింగారం రైతువేదికలో..

నారాయణపేటరూరల్,జూలై18: పేట మండల పరిధిలోని సింగారం గ్రామంలోని రైతు వేదిక వద్ద గురువారం రుణమాఫీ అవడంతో రైతులు సంబురాలు చేసుకొన్నారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మక్తల్ మండలంలో..

మక్తల్, జూలై 18: మక్తల్ అంబేద్కర్ చౌరస్తా, నర్వ మండల కేంద్రంలో రైతులతో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారంగా రైతులకు రుణమాఫీ చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మిథున్ చక్రవర్తి, ఏఈవో విజయ్, రైతులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

2,557 మంది రైతులకు రుణమాఫీ

ఊట్కూర్, జూలై18: మండలంలో రూ.లక్ష లోపు రుణబకాయి ఉన్న రైతులు 2,557మందికి మాఫీ వర్తించిందని ఏవో గణేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కొల్లూరు రైతువేదిక భవనంలో రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు బైక్ ర్యాలీలు నిర్వహించారు.

రైతుల కన్నీళ్లు తుడిచిన రేవంతన్న

మరికల్, /ధన్వాడ, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కన్నీళ్లు తుడిచిందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మరికల్, ధన్వాడ మండల కేంద్రల్లో రైతులతో కలిసి రుణమాఫీ విజయోత్సవ ర్యాలీల్లో పాల్గొన్నారు. మరికల్‌లో బైక్ ర్యాలీలో పాల్గొని ఇందిరా గాంధి చౌరస్తాలో బాణపంచా కాల్చి, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ధన్వాడలో ఎడ్ల బండిపై రైతువేదిక వరకు ర్యాలీ నిర్వహించారు.

దేవరకద్ర మండలంలో..

దేవరకద్ర, జూలై 18: మండల కేంద్రంతోపాటు మండలంలోని అయా గ్రామాలల్లో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశానికి ఆయా గ్రామాల రైతుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రుణమాఫీ సంబురాల్లో పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

అమ్మ మాట- అంగన్‌వాడీ బాట ర్యాలీ

ధన్వాడ/ఊట్కూర్/జడ్చర్ల, జూలై 18: అమ్మ మాట-అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గురువారం ధన్వాడలో చిన్నారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాణి, శ్రీలక్ష్మి, భూదేవి, శారద, సావిత్రమ్మ పాల్గొన్నారు.

జడ్చర్ల ప్రాజెక్టు కావేరమ్మపేట సెక్టారులోని ఇందిరానగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం అమ్మమాట-అంగన్‌వాడిబాట కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మెహరున్నీసాబేగం మాట్లాడుతూ.. అండన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించాలని, ఆటాపాటలతో విద్యనందిస్తామని పేర్కొన్నారు. ఊట్కూర్ మండలం అవుసలోనిపల్లి, నిడుగుర్తిలో ఐసీడీఎస్ సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. 3నుంచి ఆరేండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. టీచర్లు శ్రీలత, శరణమ్మ, జ్యోతిలక్ష్మి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' సామాజిక తనిఖీలో అక్రమాలు

- రూ.33,662 రికవరీకి ఆదేశం
- తప్పుల తడకగా